న్నై. అవాఁడు పౌర్ణమి. పాలకడలివలె గాన్పించుచున్నది సాంద్రారణ్యమన్నియెడల

రాయలు నిద్రాదేవికోలలకు చెవియొగ్గినాడు. అన్నపూర్ణ రాయలు శయ్యనలంకరించి యాతనిపాదాలొత్తుతూ కూర్చుంది. రాయలు మేల్గాంచినాడు. సమీపమందెవ్వరును లేరు. ఆతని యాశ్చర్యమునకంత మేలేదు.

భ్రాంతియా! నిక్కమా!! అనిముపాన్నే కవితిమ్మన రావింపబడ్డాడు. రాయలు కడచినయుదంత మెఱుక జెప్పాడు కవికి.

* * * *

మఱునాఁడుదయం. రాయలకించుక దేహాస్వస్థత కేకూరినది కవితిమ్మన యాతనిప్రక్కనే యాసీనుఁడైనాడు.

రాయలు—"ఏదైన గ్రంథపఠన మొనర్చినయెడల—"

కవితిమ్మన—ఈమధ్యనే "పారిజాతాపహరణం" రచించాను. ప్రభువులు సావధానంగా నాలించేయెడల—"

రాయలు—"ఏదీ గ్రంథమధ్యస్థాన నొకపద్యముఁజదువుడు."

తిమ్మన—

"జలజాతాసనవాసవాది సురపూజాభాజనంబై తన
ర్చులతాంతాయుధు కన్నతండ్రిశిరముచ్చోవాముపాదంబునం
దొలఁగంద్రోచె లతాంగి యట్లయగు నాథుల్నేరముల్సేయఁజే
రలుకం జెందిన యట్టికాంతలుచిత వ్యాపారముల్నేర్తురే."

విస్మితుఁడైపోయాడు రాయలు పద్యాన్నాలించగనే. మరల హృదయసంక్షోభం. "రజకుని కథాకల్పనాకారకులు మీరేనా?"

కవి ప్రత్యుత్తరమీయలేదు.

రాయలు—"కవిశేఖరా! రత్నమకుటపతన యశుభ సూచకాన్నిగూర్చి తలపోయుచుంటినేకాని అన్నపూర్ణనేరం విషయంలో తగినరీతి నాలోచింపకయే యామె నెన్నియో యిక్కట్ల పాల్జేసితిని. దారుణశిక్ష విధించాను అన్నపూర్ణకి క్రోధావేశంచేత. ధూర్తుడను. నను మన్నింపవలెను. రజకుని కథాకల్పన—పారిజాతాపహరణ రచనము—ఇవి నాకొరకే నాతప్పు నెఱుకపరచుటకే నిర్దేశింపబడినవి. ఇక నామెను వీక్షించవున్నహో—" రాయలుమాట తడబడినది. కంఠము రుద్ధమైనది. వాక్కు అరికట్టబడినది. ఒక్కసారిగా యశ్రుపూరితములైన వాతని నేత్రాలు. "ఆమె లేనిదే నేను జీవింపజాలను. నాకీ రాజచిహ్నములనవసరము. విరాగినయ్యెద." రాయలు ఱొఱనుంచి ఖడ్గంతీసి క్రిందపాఱవేయుటకు సంసిద్ధుఁడైనాడు కాని యాతనిహస్త మదిమిపట్టుకొనబడినది. రాయలు తెనుదిరిగిజూచినాడు. స్తంభితుడైపోయాడు. కృశించి శల్యావశిష్టయైన యామె అన్నపూర్ణగాక మరెవరు? అన్నపూర్ణ రాయలు పాదాలకి నమస్కరించింది, రాయలామెను లేవనెత్తి ముద్దాడినాడు.

"ఈపారిజాతాపహరణం మీయిరువురి పునస్సమాగమానికి అంకితం" అన్నాడు కవి ఆనందబాష్పాలు విడుస్తూ.

* * * *

రత్నమకుటపతన యశుభసూచకము నిజమైనది. బలభద్ర రాయలు గోల్కొండ బీజపూరు సుల్తానులతో నేకీభవించి తనపై దండెత్తనున్నాడనే వార్త శ్రీకృష్ణదేవరాయలకు నివేదింపబడినది.

"విధికృతం—జరుగనున్నది జరుగకమానదు. ఏనాఁడు రత్నమకుటము భూపతనమైనదో ఆనాటినుంచియే యిటువంటిది నెదుర్కొన సంసిద్ధుఁడనైయున్నాను. భగవదేచ్ఛ" అనుచూ కేల్మోడ్చినాడు శ్రీకృష్ణదేవరాయలు.

* * * *

# త్రాగుబోతుకు జాలిలేదా?

పుల్లాభొట్ల సూర్యనారాయణశాస్త్రి.

త్రాగుబోతుకు జాలిలేదా? అంటే, త్రాగుబోతుకు జాలేమిటంటారు కాని నిజమాలోచిస్తే, ప్రతిమానవునికి ఉండే ఫీలింగ్సన్నీ త్రాగుబోతుకూ ఉంటాయి. త్రాగినప్పుడు మాత్రం వళ్లు తెలియక కొన్ని క్రూరపు పనులు చేస్తాడు. ఇల్లాంటి దుర్మార్గపుపనులు చేయుటచే మనమంతా చులాగ్గా త్రాగుబోతు కఠినుడు, క్రూరుడు అంటాము. మనం అనడంలోను అర్థం లేకపోలేదు. అతడు చేసేపనులకి కారణం లేకపోలేదు. అన్నిటికీ అసలు కారణం త్రాగుడే, నిత్య

మూతాగేవాడి దగ్గరకు వాడుత్రాగకపూర్వం వెళ్ళి వాడితో మాట్లాడిన ఎంత దయార్ద్రహృదయుడో, ఎంత ప్రేమస్వరూపుడో, ఎంత ధర్మ ప్రవర్తనుడో, సర్వవిధములా ఎంతమంచివాడో తెలుస్తుంది. త్రాగినప్పుడు వెళ్ళిచూస్తే పై గుణములన్నిటికీ వ్యతిరేకంగా కనుపిస్తుంది. ఈగుణ భేదమునకు కారణం త్రాగుడు కాకమరేమిటి ? త్రాగేవాణ్ని త్రాగవద్దంటే కోపం. వ్యభిచారం చేసేవాణ్ని మందలిస్తే తంతాడు. వీళ్లిద్దరే కాదు, ప్రపంచకములో ఎవడితప్పు వాడికి చూపిస్తే కోపం వస్తుంది, మనుష్యుడి నైజలక్షణమే దీనికి కారణం. గురివింతగింజ తనసలుపు తానెరుగదు. అల్లాగే మనుష్యుడు తనతప్పులు తానెరుగడు. తనకేమీ తప్పులు లేవనుకుంటాడు. అందుచేతనే తప్పులు చూపిస్తే కోపం వస్తుంది. ఎంత సత్ప్రవర్తనుడినైనా నిమిషంలో దుర్మార్గుణ్నిగా చేసే మహిమ కలది త్రాగుడే. ఇంత మహిమ కలది కాబట్టే ఇంత ఎక్కువ సేల్‌లో ఉంది.

రామారావు బియ్యే ప్యాసయాడు. ఏంలాభం? నిరుద్యోగపు రోజుల్లో ఎవరు చూస్తారు రామారావు మొహం? దేశమంతా గ్రాడ్యుయేట్లే. అట్టిభాగ్యవంతుడు కాదుకూడాను లంచమియ్యడానికైనా. తిండిగడవడమే బ్రహ్మాండం. తండ్రిని పీక్కుతిని, ఉన్న ఎనిమిదెకరాల నిక్షేపంలాంటి పొలం చదువుకై అమ్మించేడుకాగదా! ఆవెర్రి బ్రాహ్మణుడు ఒక్కడే కొడుకుగదాయని బియ్యేప్యాసయి తనను సింహాసనము మీద కూచోపెడతాడని నమ్మి పొలం రెండువేలకు అమ్మి ఆసాహసంతో కొంతవరకు చదివించాడు. రెండువేలేం సరిపోతాయి ? కనక ఉన్న మూడువేలరూపాయల ఖరీదుచేసే ఇల్లుకూడ రెండువేలకు తాకట్టుపెట్టారు తండ్రీ కొడుకూ కలిసి. తండ్రి ముసలాడు. అట్టే చదువుకున్నవాడుకాడు. చాదస్తుడు. విన్నన్నచెప్పింది వేదమన్నట్లు కొడుకెంత చెపితే అంత చేస్తుండేవాడు. రామారావు చిన్నప్పుడే తల్లిచనిపోయింది. తల్లిలేనిబిడ్డ కనక మరీగారం. కాలేజీ చదువొచ్చాక రామారావు పూర్తిగా స్వతంత్రుడై పోయాడు. రోజూ సిల్కుసూట్లలోను, గోల్డుఫ్లేకు సిగరెట్లలోను నిండిపోయేవాడు. ఇష్టమువచ్చినట్లు డబ్బు తగలేశాడు. ఎల్లాగైతేనేం, మొత్తము మీద ఇల్లూపొలం తువరం అయేటప్పటికి కాలేజీచదువు పూర్తయింది. (అప్పుతీర్చలేక ఇల్లు వదులుకున్నారులెండి) భార్యారత్నం కాపరానికొచ్చింది

ఒకసంవత్సరం ఉద్యోగము కోసము తిరిగాడు ఎక్కడా ఖాళీలేదనే శబ్దం మారుమోగింది. దరిద్రాలన్నీ ఒక్కసారే పట్టుకున్నాయన్నట్లుగా ముసలాయనకాలం చేశాడు. సంసారభారం రామారావుమీద పడ్డది. సంసారమంటే పెద్ద సంసార మేమీలేదు. భార్యా, తనూను ఇంట్లో ఉన్నవాళ్లు. ఇంక అవూళ్లో ఉంటే లాభంలేదని విశాఖపట్నం చేరుకున్నాడు భార్యతోకూడాను. నెలకు ఆరురూపాయిల చొప్పున ఒకచిన్నయిల్లు అద్దెకుతీసికొన్నాడు. అవూళ్లోకూడా ఒకవారంరోజులు, 20 రూపాయిలిస్తే ప్లీడరు గుమాస్తాగానైనా, కోమటి గుమాస్తాగానైనా చాస్తానని తిరిగాడు. ప్లీడర్లకే భుక్తికడవడం కష్టంగానున్న ఈకాలంలో గుమాస్తాలను కూడ ఎవరు పోషిస్తారు? కోమటిగుమాస్తా అసలేదొరకలేదు. తిరగ్గా, చివరికి ఒక ఖాండిషాపులో అప్పాయింటుమెంటు దొరికింది. ఇరవై రూపాయల జీతం మీద రామారావుకు ఆషాపు మేనేజరు రెండు నెలల వరకు చూసి బాగుంటే ముప్పైరూపాయిలు చేస్తానన్నాడు జీతం. రామారావు పట్టలేని ఆనందంతో ఇంటికి వచ్చి భార్యతోచెప్పా

డు. మరుసటిరోజునుంచీ రెగ్యులరుగా షాపులో పనిచేయడం మొదలెట్టాడు.

అన్నివ్యాపారముల కంటె ఇప్పుడు బ్రాందీ వ్యాపారమే చాలా బాగుంటోంది. సేల్ చాలాఎక్కువ. పెద్దాపిన్నా అంతా అక్కడికే చేరారు. శాస్త్రవాగ్వాటిగల ప్లీడరుగారికి బ్రాందీ బుడ్డి లేందే గడవదు. సరే మననటకులలో చాలమందికి అదేగదా జీవనం గడిపేది. పైగాబ్రాందీలో చాలా ఆకర్షణశక్తి ఉన్నది. వచ్చిగాళ నపించేవాడి కొంపార్పడమంటే బ్రాందీకి బలే హుషారు. సానులకి సరసులకి బ్రాందీయే ప్రాణం. అల్లాంటి బ్రాందీషాపులో చేరాడు మన రామారావు. ఇంకెల్లాగుంటుందో చూడండతని సంగతి. ఆషాపులో కాతాగల పెద్దమనుష్యులంతా స్నేహితులయారు. వాళ్లతోపాటు రామారావుకుకూడా సాధారణంగా రుచి తగులుతుండేది. ఔను స్నేహితులాఫర్ చేస్తే వద్దంటాడా, అది పెద్దమనుష్యుని లక్షణం కాదుగా. అప్పుడప్పుడల్లా, అలవాట్లోకి దిగింది చివరికి. నిత్యము కొంచెమో గొప్పో బ్రాందీ లేందే గడిచేదికాదు. పాపం. ఇంక మేనేజరు, రామారావు వచ్చాక అమ్మకం బాగుందని జీతం చెప్పినప్రకారం ముప్పైరూపాయలు చేశాడు. రోజూ టైంటేబిలు ప్రకారం సాయంత్రము ఏడుగంటలకు బుడ్డికాళీచేసి ఇంటికెళ్ళి పరవళ్ళు త్రొక్కేవాడు రామారావు. కొన్నాళ్ళుపోయాక ఆవూళ్లోకల్లా భాగ్యవంతురాలు, దీపాలార్పడంలో బాగా ప్రఖ్యాతి వహించినదగు ఇందుమణి యనువేశ్యతో స్నేహమారంభించాడు. ఆవిడ మహాపతివ్రతయని అందరితో చెప్పడం మొదలెట్టాడు కూడాను. (ఎవరి అభిమానం వాళ్ళది.) కొందరు నవ్వుకునేవారు. కొందరు వదిలించాలని ప్రయత్నించేవారు. ఇల్లాదిగింది రామారావుపని చివరికి.

రామారావుభార్య పేరు సుశీల. మహాపతివ్రత అనుకునేవారు లోకులు. అట్టే చదువుగో లేదు. గృహకృత్యము లకు లోటులేదు. భర్తకనువర్తనతో ప్రవర్తిస్తుండేది. ఎన్నడూ ఎదురుచెప్పిఎరగదు. తల్లీదండ్రీ పాపం! చిన్నప్పుడే చనిపోయారు. పుట్టింటివారెవ్వరూ దగ్గర తీసేవారులేరు. ఈకాలంలో ఆస్తివున్నప్పుడంతా దగ్గరబంధువులే, కాని లేనివాళ్ళ జోక్యమెవరికి కావాలి? నిజానికి సుశీలను భర్తతప్ప ఆదరించేవాళ్లెవరూ లేరు. రామారావు పూర్తిగా తాగివచ్చి ఎంతఅల్లరిచేసినా కొట్టినా తిట్టినా అతిఓర్పుతో సహించేది. అతడు చేయుదుండగముల కులమె కాబట్టే సహిస్తోంది, మరెవ్వరూ సహించలేరు అనుకునేవారు ఇరుగుపొరుగు వాళ్ళు. కాని, పట్టణాల్లో ఒకరి జోక్యమొకరి కక్కర్లేదు. గొంతుకెండిపోతున్నా మంచినీళ్ళివ్వరు. పంపుదగ్గరకెళ్ళి తాగమంటారు. నాగరకత దేశంలో ఎక్కువగుచున్న కొలది, దయదాక్షిణ్యములు క్షీణించుచున్నాయి. కారణం మీరే ఊహించుకోండి. సుశీల విషయంలో కూడ ఇరుగుపొరుగువాళ్లావిధంగానే ఉండేవారు. ఇకరామారావు రాత్రిపదకొండు గంటలకి, పగలు ఒంటిగంటకి భోజనాని కొచ్చేవాడు. ఒక్కొక్కరోజు నఇందు మణి ఇంట్లోనే భోజనం చేసేవాడు. అల్లాటప్పుడు యింటిమొహం చూడవలసిన నవసరం లేకపోయేది. సుశీల భర్తవచ్చేవరకు భోజనం చేయకుండా ఉండి, భర్త భోజనం అయాక తాను భుజించేది. రానిరోజున ఒంటిగంటవరకు భర్తరాకకై నిరీక్షించి తర్వాత భుజించేది. ఇదే మన హిందూవనితల్లోని చాదస్తము. రామారావు ఒక్కొక్కప్పుడు రెండు, మూడురోజులు యిం

టికి రాకపోయినా ఓపికతో శాంతం వహించి తనలోతాను దుఃఖించి ఊరకుండేది. ఏంచేయగల దుస్త్రీ? మానవతియగుస్త్రీ తనభర్త కగౌరవ మొకలిగిన తనకు గానే భావించును. అప్పులవాళ్ళు డబ్బుకై వచ్చినపుడు వాళ్ళతో నెమ్మదియగు మాటలు చెప్పి, వారిని సాగనంపేది సుశీల. ఇంత సుగుణ సంపత్తిగల యామెను రామారావు పూర్తిగా త్రాగివచ్చి ఎముకలు పొడియగునట్లు కొట్టేవాడు. త్రాగినప్పుడు వళ్ళు తెలియక భార్యను కొట్టేవాడన్న ఆశ్చర్యమేమి? అతడు ప్రేమలేక కొట్టెనా? లేదు—దయదాక్షిణ్యములులేవా? లేక పోలేదు. మరెందులకు కొట్టెనని ప్రశ్నించిన త్రాగినప్పుడు ఒళ్ళుతెలియక మంచిచెడ్డల విచక్షణాశక్తి లేక, శరీరమదముచే కొట్టెననే జబాబు సరిపోతుంది. ప్రతి త్రాగేపురుషుడు ఈవిధంగా కొడతాడాంటే మనదేశంలో చాలమంది ఈవిధంగా గృహలక్ష్ములగు నిల్లాండ్రి ననేక కష్టముల పాలుచేసేవారు కలరు. త్రాగకపూర్వము వారు భార్యలయెడ మిక్కిలి ప్రేమగలవారై మెలగవచ్చును. గాని వారిని క్రూరులుగను, నిర్దయులుగను మార్చుచున్నదా త్రాగుడే. ఇంత దుర్మార్గమున ప్రవర్తింపజేయుచున్న త్రాగుడును భగవంతుడింతఉన్నత స్థితికి తీసికొని వచ్చుటకు హేతువేమో!

ఒకనాడు సుశీలకు తలనొప్పి, జ్వరము వచ్చినది. గంజికాచి పోయువారైన నింటలేరు. ఆనాటికి రెండు దినములనుండి రామారావు ఇంటికి వచ్చుటలేదు. వేశ్యాప్రియుడై భార్యమొగమైన చూడక, ఇందుమణియిల్లు కుక్కవలె కాచి పెట్టుకొని యుండెను. అసహాయురాలగు స్త్రీ అట్టిసమయమున నేమిచేయగలదు? ఆర్తనిరాదరణాను తలచుకొని లోలోన మిక్కిలి దుఃఖించెను. తనభర్తయె తనకు సహాయముచేయనప్పుడితరు లేలచేయుదురు! తాను పూర్వజన్మమునచేసిన పాపఫలితమని తన్నుదానిందించుకొనెను. తన కష్టములగాని, భర్తప్రవర్తనను గాని వెలిబుచ్చనిచ్చగింపక ఎవరితోను చెప్పలేదు. ఇతరుల సహాయము కోరలేదు. నాడామెకు ఔషధము, ఆహారములేవు. మరునటి దినముకూడా భర్తరాలేదు. జ్వరము హెచ్చినది. ఆమెకు చనిపోవుదుననెడి బెంగయేలేదు. ఆకష్టములభరించలేక ఆమె చావునే కోరుచుండెను. నాడుకూడ ఆహారము లేదు. ఆప్రకారమామె నిరాహారియై నాలుగు దినములు గడిపెను. భర్తరాకకై ప్రతిక్షణము నిరీక్షించుచుండెను భర్తదర్శనములేక యామె కన్నులు కాయలుగాచినట్లుండెను. భర్తను తలపోసి కంటికి మంటికి నేకధారగా నేడ్చుచుండెను. క్షణమొక యుగముగ నామె గడపుచుండెను. జ్వరతీవ్రముచే నేమేమో తనలోదాను పలుకుచుండెను. తానింక జీవించనని నిశ్చయించుకొనెను. కడసారి చూపులైన కలుగునో, కలుగవో యని దుఃఖించుచుండెను. ఆమెహృదయమతి వేగముగ కొట్టుకొనుచుండెను. కొన్నిగంటలకంటె నెక్కుడుకాలము బ్రతుకనని యామెకు తెలియును.

అట్లు పరుండియుండ కొంతసేపటికి రామారావువచ్చెను. భార్యస్థితిచూచినిర్ఘాంతపోయెను. మనస్సులో తన్నుదానిందించుకొనెను. తనక్రూరకృత్యములకు మిక్కిలిదుఃఖించెను. వెంటనే జిల్లా డాక్టరును తీసికొనివచ్చి భార్యను చూపించెను. అతడు చేతినాడిని, శరీరమును పరీక్షించి, లోన కొన్నికండరములు కుళ్లిపోయినవి, ఊపిరితిత్తులు చెడిపోయినవి—ఇక ఆమె బ్రతుకదు అని చెప్పి వెళ్లిపోయెను. రామారావు వెక్కివెక్కి యేడ్చుచు భార్యప్రక్కనే కూర్చుండెను. ఎవరైనను తనభార్యను బ్రతికించిన 116 రూ॥ బహుమతిచ్చెదననెను. జబ్బంత ముదిరిపోయిన తరువాత నెవరు బాగుచేయగలరు? సుశీల ఆఖరిమాటలుగ— త్రాగుడు మానివేయమనియు, తనకై దుఃఖించి శరీరమునందస్వస్థత కలిగించుకొనవలదనియు, తనతప్పుల నన్నిటిని క్షమించమనియు చెప్పి,

నమస్కరించి ఈలోకమునువీడెను. రామారావు భార్యపై పడి ఏడ్చి ఏడ్చి, చేయునదిలేక, శవదహనమునుగావించి వచ్చి భార్యావియోగ దుఃఖమును భరించలేక మతిపోయినవానివలె క్రింద చతికిలబడెను. అతనికి, తానీప్రపంచమున నెవ్వరికొరకు బ్రతుకవలెనో తెలియలేదు, తండ్రి లేదు, తల్లిలేదు, భార్యారత్నమగు సుశీలకూడ ఈలోకమునువీడెను. నా యన్నవారెవ్వరును లేరు. సుశీలలేకుండ జీవితమును గడపుట కడు దుర్లభముగతోచెను. పట్టలేనిదుఃఖమున తన స్థానమునుండిలేచి, తలుపులనన్నిటినిమూసి, ఒక దూలమునకు త్రాటినిబిగించి ఉరితీసికొని చనిపోయెను. మరునాటి యుదయమున పోలీసు వారువచ్చి ఉతకలెత్తుసరికి రామారావు శవము త్రాటికి వ్రేలాడుచుండెను.

రామారావుభార్య బ్రతికి యున్నంతవరకు పలువిధముల బాధపెట్టెను. ఆమె చనిపోయిన తరువాత తన అంతరంగిక ప్రేమను బయల్పరచెను. తనసంపాదన గాని, ఇందుమణి సౌందర్యము గాని అతని మరణసమయమున జ్ఞప్తికి రాలేదు. అనగా నాతడు అన్నిటికికంటె తనభార్యనే మిక్కుటముగ మనస్సునందు ప్రేమించెను. చివరకు సుశీల స్థితి పరికించి మిక్కిలి జాలిపడెను. ఏమి లాభము ? తన క్రౌర్యమునకు పరిపరి విధముల దుఃఖించి, తానుచేసిన తప్పుల గ్రహించి భార్య యందలి ప్రేమను పట్టజాలక ఆత్మహత్య గావించుకొనెను.

# రాజ్యలక్ష్మి

జనస్వామి కోదండరామశాస్త్రిగారు.

రాజ్యానికి సుమారు పదునారు సంవత్సరములుంటవి నవయువ్వనంలోయున్నవి. పురుషులను జూచునపుడు కలతచెందేది. నిమ్మపండువంటి శరీరచ్ఛాయ, చక్కని నుదురు, చిరునవ్వు తాండవమాడే పెదవులు, త్రాచుపాములాంటి వాల్జడ, తేజోవంతములైన నేత్రములు, చెవులకు లోలకులు, కాళ్లకు పట్టీలు, కాళ్లకు కలకత్తా సేండిల్సు, కళ్లకు చలువద్దాలు—యివన్నీచూస్తే ఇంద్రునిభార్య శచీదేవి తలుపుకొస్తుంది. పెండ్లి కబుర్లు కులాసాగా వినేది. ఎక్కడలేని నవనాగరికత మూర్తీభవించింది రాజ్యానికి. కొంచెంసేపు మిస్. సులోచన పద్ధతి, కొంచెంసేపు సరోజినీ బాయి పద్ధతిని, అవలంభించేది. ఈమెముఖపద్మము చంద్రబింబమువలె మెరయుచు స్త్రీలకుండవలసిన గంభీరత్వము తాండవమాడుచు గన్పట్టుచుండెను. హాస్యరసపత్రికలంటే ఆమెకు సంతోషం. అవి పక్కనుంచే నిద్రకూడా అవసరం లేదు. ఎప్పుడూ ఆలోచనాసముద్రంలో మునిగి తేలేది. సంగీతమంటే ఆమెకు చాలాఅభిమానం. ఎప్పుడూ దానినిగురించి ఆలోచించడం, తత్సంబంధములైన పుస్తకములను చదువుతూండేది.

తాండవం రాజ్యానికి మేనత్తకొడుకవుతాడు. అతను రాజ్యంగారి ఇంటిదగ్గరేయుండి కాలేజీలో బి. ఏ. చదువుతున్నాడు. బాగా పసిమికాకపోయినా చామనఛాయగల దేహము, లోతుగల కండ్లు, నవ్వులొలుకుతున్న విశాలమైన నేత్రములు, గుండ్రనిముఖము, అతని అందాన్ని చాటుతున్నవి. అయస్కాంతము ఇనుమును ఆకర్షించునట్లు తాండవం హృదయాన్ని ఆకర్షించేది రాజ్యం. అతడు ఆమెను జూడగానే దుఃఖమునకు స్వస్తిచెప్పి సంతోషమునకు స్వాగతమిచ్చేవాడు. వారిరువురిప్రేమను అడ్డుపరచేవాళ్లు దుష్టులు. ప్రతిరోజూ సాయంత్రం సమయమున బీచికి షికారుకెళ్లేవారు. ప్రేమబీజములు వారిరువురి